# గుండె మీద వేలిముద్ర

అతను లోపల కదుగుపెట్టగానే అంతవరకు గుమ్మం దగ్గర నిలబడ్డ ఆమె రోడ్డుకేసి అటు ఇటూ చూసింది. అంతా నిర్మానుష్యంగా వుండడంతో చటుక్కున తలుపు మూసి గడియపెట్టింది.

అతను గుమ్మం దగ్గరే ఆగిపోయి బిత్తర చూపులు చూస్తున్నాడు. అతని కాళ్ళు నేలమీద సరిగా నిలవడం లేదు. ఆమె అతనికి కళ్ళతో ధైర్యం చెప్పి తన వెంట రమ్మంది. అతనేదో మాట్లాడబోయాడు. ఆమె చూపులతోనే వారించింది. ఆమె తిన్నగా బెడ్‌రూమ్‌లోకి దారితీసింది. ఆమె వెంట అతను...

"అమ్మగారూ..." అతని కాళ్ళు వణుకుతున్నాయి. ఆ నాలుగక్షరాలు కూడా స్పష్టంగా పలుకలేకపోయాడు.

"నీ కళ్ళకు నేనంత పెద్దదానిలా కనిపిస్తున్నానా?" సినిమాల్లో రచయిత రాసిన వాక్యాన్ని కెమేరా ఎక్స్‌ప్లాయిట్ చేసినట్టు - ఆమె సమ్మోహనమైన చూపు ఆమె ప్రశ్నలోని ధ్వనిని స్ఫురింపచేసింది.

బదులు చెప్పడానికి అతనికి మాటలు దొరకలేదు. తలవంచుకుని ఆమె చీరకట్టులోని నైపుణ్యాన్ని ఆబగా చూస్తున్నాడు.

"అసలు ఈ జాకెట్లు నా అందాన్ని సగం చంపేస్తున్నాయి. అది జాకెట్లిచ్చి ఎవరో ముసలాడి చేత కుట్టిస్తున్నారు... చూడు ఈ చేతులూ మెడ ఎంత లూజుగా వున్నాయో..." జాకెట్టును చూపించడాని కనువుగా పైటను తప్పించింది.

"మీ పెర్సనాలిటీకి వీనెక్ జాకెట్లు బావుంటాయి."

"నేను నీ కంటికి ఎలా అందంగా కనిపిస్తానో ఆ మోడల్‌లో కుట్టు. అతికినట్టు వుండే జాకెట్లంటే నాకు బాగా ఇష్టం. షేపులు బాగా కనిపించాలి... నువ్వు కొలతలు తీసుకుని కుడతావనే లోపలకు పిల్చింది..."

"అవసరం లేదు... మీ కొలతలు నాకు తెలుసు..."

"ఎలా?" ఆమె కళ్ళు మిలమిల మెరిశాయి.

అతడి నోట్లోంచి సమాధానం రాలేదు

** ** ** **

నిద్రలో పక్కు మారిన రాంబాబు ఉలిక్కిపడి లేచాడు. గడ్డివాముకి చేరబడ్డాడేమో ఒళ్ళంతా దురదగా వుంది.

కళ్ళు తెరచి చూస్తే ఎదురుగా పంట కళ్ళంలో-

ముసిముద్రలు వేసివున్న ధాన్యం రాశి, కనుచూపు మేర కోసిన వరిచేలు, దూరంగా చెఱకు తోట... సందేహం లేదు. తను వున్నది పొలంలోనే! అయితే ఇంతసేపు తన కళ్ళముందు జరిగిన దృశ్యంలో పద్మ, రాజా... అంతా పగటి కల! 'అమ్మయ్య' నిశ్వాసంతో అతని గుండెలు తేలికయ్యాయి.

రాంబాబు గాబరాను చూసి కిసుక్కున నవ్వాడు పాలికాపు నారాయుడు.

"నువ్వెంతసేపయిందిరా వచ్చి?"

"ఇప్పుడే, ఓ సెనయింది కాని బాబూ, గొప్పగా కాపలా కాసేస్తున్నారులెండి. పగటాల నిద్దరోవడమే కాకుండా పలవరింతలు కూడాను. ఏ సినిమా 'యిరో యిన్నయినా కల్లోకొచ్చిందేటి బాబూ?"

"నీ వెధవ వేళాకోళం చాలుకాని, నోర్మూసుకో ముద్దు సన్నాసీ. రాత్రంతా హాయిగా గురకపెట్టి నిద్ర పోయావు. కంటిమీద కునుకులేకుండా తెల్లవార్లూ కాపలా కాసింది నేను. ఇప్పటివరకు మెలకువగానే వున్నాను. ఇప్పుడే చిన్న కునుకు పట్టినట్టుంది. అయినా నేను రాశి దగ్గరుండగా గింజ ముట్టుకునే దమ్మెవడి కుందిరా?" అంటూ మీసం చేత్తో సవరించుకున్నాడు ముప్పయ్ అయిదేళ్ళ రాంబాబు.

"బాబుగారూ... మీ గురించి ఢిల్లీదాకా చెప్పుకుంటున్నారటగాని... రాత్రికైనా ధాన్యం యిల్లు సేరేట్టు సూడండి. రేపు ముత్తేలమ్మ సంబరాని కెల్దామను కుంటున్నాం. మూడు గంటల కల్లా మనముల్లొచ్చేత్తా మన్నారు. మీరో పాలెల్లి ఆ ట్రాక్టరోడికి సెప్పిరండి - బేగా రమ్మని."

"అలాగే! టీ తీసుకొస్తానన్న మా చిట్టిబాబు కూడా వూడిపడలేదు. నేనింటికెళ్ళి టీ తాగి ట్రాక్టరు పురమాయించి వస్తాను. మా చిట్టిబాబు ఏ అడ్డదారినైనా వస్తే - యిక్కడే వుండమను. కోళ్ళకి బుద్ధిచెప్పి అత్తరంకోయిందన్న సామెతగా చెయ్యక - జాగ్రత్తగా కాపలా కాయి. గంట తిరక్కుండా వచ్చేస్తాను" అంటూ పైకి లేచి - వంటిమీద గడ్డిపరకలు దులుపుకొని, టవలు తీసి భుజం మీద వేసుకొన్నాడు రాంబాబు. లుంగీ ఎగ్గట్టి సైకిలు వరకు వెళ్ళినవాడు - మళ్ళీ వెనక్కొచ్చి గడ్డి మేటుకు చేరేసిన బల్లెం కర్ర చేతిలోకి తీసుకున్నాడు.

"పగటాల దాని పనేటండి?" అన్నాడు రాంబాబు వాలకాన్ని చూసి అనుమానించిన నారాయుడు.

"చేతిలో కర్రుండడం ఎందుకైనా మంచిది కదరా?" అంటూ సైకిలెక్కాడు రాంబాబు. అతని కళ్ళలోని ఎర్ర జీరలు నారాయుడికి అనుమానాన్ని కలిగించాయి.

* * * *


సైకిలు చక్రాలు మందంగా తిరుగుతున్నాయి.

రాంబాబు ఆలోచనలు తన భార్య పద్మ చుట్టూ తిరుగుతున్నాయి.

పద్మ - రాజా... తను ఈ మధ్య వాళ్ళ గురించే ఆలోచిస్తున్నాడు. అందుకే అలాంటి కల వచ్చింది. పద్మ సహజంగా చురుకైంది. సెక్స్ కోరికలు కూడా ఎక్కువే. అలాంటి పద్మ అందుబాటులో వున్న రాజా విషయంలో చొరవ తీసుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. పద్మ అసలు ఆ అభిప్రాయంతోనే రాజాచేత అరుగు మీద మిషన్ పెట్టించడానికి తనను ఒప్పించిందేమో! పద్మ ఎంతకైనా తగిన ఆడది.

తనింటి దగ్గర లేకపోతే చాలు - పక్కింటి కాలేజీ కుర్రాడు సతీష్ దగ్గర్నుంచి పత్రికలు తెప్పించుకుని చదివేది. తను అది గమనించి అలా తెచ్చుకోవడం తన కిష్టముండదని నిర్మొహమాటంగా చెప్పేశాడు. 'మీకన్నీ అనుమానాలే' అని మూతి ముడుచుకున్నా, తన మాటకు కట్టుబడింది. ఆ తర్వాత కాలక్షేపం కావడం లేదని మారాం చెయ్యడం ప్రారంభించింది. పడక గదిలో తన కాళ్ళు పత్తుతూ కుట్టుమిషన్ నేర్చుకోన దానికి తనని అంగీకరింపచేసింది. తను సరే అనగానే - యముడిని యిరకాటంలో పెట్టిన సావిత్రిలా - 'నేర్చే

వాళ్ళు లేందే కుట్టు మిషను ఎలా నేర్చుకుంటా'నంది. పట్నంలోలా - పల్లెటూరిలో అలాంటి సెంటర్లుండవు. నేర్పే ఆడవాళ్ళెవరైనా వుంటే చూసుకోమన్నాడు. ఆడాళ్ళెవరూ లేరని, మర్నాడు రాజును తీసుకొచ్చింది. రాజా తన కంటె కుర్రాడు. ఎర్రగా, బుర్రగా ఏపుగా వున్నాడు. 'అరుగుమీద గది అతని కద్దె కిస్తే -




ఆదాయం కూడా వుంటుంది కదా' అని ఎరవేసింది పద్మ. తను యిద్దర్నీ ఎగాదిగా చూసి - 'చూద్దాంలే' అన్నాడు. అంతే - ఆ రాత్రి నుంచి సత్యాగ్రహమూ, సహాయ నిరాకరణోద్యమమూ ప్రారంభించింది పద్మ.

పెళ్ళయి పదేళ్ళయినా యింట్లో పిల్లా జెల్లా లేరు... ఎవరో కళ్ళు అడ్డముంటే - ఒకవేళ పద్మకు దుర్బుద్ధి పుట్టినా సాగకుండా వుంటుందని పద్మ చెల్లెల్ని తోడుగా తెచ్చుకుందామన్నాడు. 'పెళ్ళి కెదిగిన పిల్ల - దాన్నెలా పంపిస్తారు' అంది పద్మ. అవును మరి, కట్నం పోసి కొనుక్కున్న మగాణ్ణే ఆ మాత్రం అనుమానించే హక్కు ఆడదానికుండొచ్చు - అదే మగాడనుమానిస్తే మాత్రం ఏ అగ్ని ప్రవేశానికో సిద్ధమౌతుంది.

ఎలాగైతేనేం ఏదో సాకు చెప్పి కాలేజీలో ఇంటర్మీడియెట్ చదువుతున్న పద్మ తమ్ముడు చిట్టిబాబును యింట్లో పెట్టుకున్న తర్వాత - రాజును అరుగుమీద మిషను పెట్టుకోడానికి అనుమతించాడు. 'నీ మీద ఏదైనా కంప్లైంటు వస్తే మాత్రం వూరుకోను. అల్లరి చిల్లరిగా తిరిగేవాళ్ళను చేరనివ్వక జాగ్రత్తగా వుండు మరి!' అని పద్మ లేని సమయం చూసి రాజును గట్టిగా హెచ్చరించాడు కూడా!

తన అనుమానం కాని - పెద్దింటి నుంచి వచ్చిన పద్మ కలలోలా తొందరపడుతుందా? ఏమో? ఏం చెప్పగలం? నిన్న తనకో ఆకాశరామన్న ఉత్తరం కూడా వచ్చింది - 'రాజా రసికుడు. నీ పెళ్ళాన్ని ఓ కంట కనిపెట్టి వుండకపోతే వాడితో లేచిపోతుంది' అని. ఉత్తరం పద్మకు చూపించి, ఇలాంటి పుకార్లు రాకుండా రాజును ఖాళీ చేయిద్దామని చెప్దామనుకున్నాడు. కాని 'ఇష్టంలేని మీరే ఈ వుత్తరం రాయించార'ని పద్మ ఎదురుతిరుగుతుందని భయపడి వూరుకున్నాడు. వాళ్ళు అలాంటి సంబంధమేదైనా పెట్టుకొంటే - తనకు పట్టుబడకపోతారా? పట్టుబడితే రాజాగాడి రక్తం తన బల్లెం రుచి చూడకపోతుందా?

ఆలోచనల వెల్లువలో పడి కొట్టుకుపోతున్న రాంబాబు హేండిల్ బార్‌కి ఆనించిన తన చేతిలోని బల్లెం కర్రను చూసి మీసం సవరించుకొన్నాడు.

తన భ్రమ కాని... పద్మ అంత తేలిగ్గా దొరుకుతుందా? పద్మ పెద్ద జాణ... పద్మ సన్నగా ఎర్రగా వుంటుంది. ఎక్కడి బిగువులక్కడున్న అందగత్తె. తను కురచ... నలుపు... పద్మ టెన్త్ వరకు చదువుకొందట. తను ఆరో తరగతితో చదువుకు స్వస్తి చెప్పేశాడు. పద్మలాంటి అందగత్తె భార్యగా దొరకడం తన అదృష్టమని అందరూ అభినందించారు. కాని యిద్దరూ కలిసి వెళ్తుంటే తమ జంటను చూసి చాలా మంది పళ్ళ సందున నవ్వుకోవడం తను గమనించాడు. అందుకే యింటి పట్టున పడివుండమంటే పద్మ వూరుకోదు. సినిమాలు, షికార్లు, ఫాషన్లు... అని వేధించుకుతింటుంది. ఫ్యాన్సీ షాపుకి వెళ్తే కొత్త వెరయిటీలన్నీ కొని పర్స

ఖాళీ చేస్తుంది. క్రీములూ, స్ప్రేలూ, లిప్‌స్టిక్‌లూ... అలంకరించుకొని తిరుగు తుంటే- అందరూ ఆమెను కళ్ళప్పగించి చూడాలి. ఇదీ పద్మ తత్వం. తను అందగత్తెనని అహంకారం. పైకి ప్రకటించకపోయినా కర్మకాలి మట్టి పిసుక్కునే వాడి భార్యనయ్యానని దిగులు... బస్సుల్లో, సినిమాల్లో, తీర్థాల్లో... షోకులకు పోయి పద్మ ఎన్నోసార్లు ఇబ్బంది పెట్టేంది. తను నోరు పారేసుకొంటే, 'నీలాంటి అనుమానం మనిషితో వేగడం కష్టం' అని ఎదురు తిరిగే పద్మ అంత సులభంగా పట్టుబడుతుందా?

రాంబాబు ఆలోచనలు పాత అనుభవాలను తవ్వు తున్నాయి.

సంతాన ప్రయత్నాల్లో భాగంగా ఓ కార్తీక సోమ వారం తనని ముక్కుకి తాడేసి తీసుకెళ్ళి గోదాట్లో ముంచి, ఆమె కూడా మునిగింది. పల్చటి తెల్లటి బట్టల్లో స్నానానికొచ్చిన పద్మ గోదావరిలో మునిగి లేచేసరికి బట్టలు వంటికతుక్కొని పోయి - ఒంట్లోని వంపులన్నీ బయటపడ్డాయి. మంత్రాలు చదివే కుర్ర పురోహితుడు పద్మకేసి తినేసేలా చూశాడు. తను చూపులతో మందలిస్తున్నా వినకుండా గట్టెక్కి చెట్టుకి చీర అడ్డం కట్టి బట్టలు మార్చేసుకొంది కూడా. ఆ ప్రదర్శన చూస్తుంటే తనకు తల కొట్టేసినట్ట యింది.

ఓసారి సినిమా హాలులో తను వెనక చేరిన రౌడీగాంగ్ ఒకటే యికయికలు... పకపకలు. ఆ గాంగ్ లీడర్ పద్మ కాళ్ళు తొక్కుతున్నట్టు... జెడ మీదకి వంగు తున్నట్టు ... పైట చెంగు లాగుతున్నట్టు... తన కని పించింది. తను సినిమా చూడలేదు. మాటిమాటికి వెనక్కి తిరిగి చూసేవాడు. సినిమా చూడ్డంలో లీన మైన పద్మ కంప్లైంటు చెయ్యందే తనెలా తిరగబడ తాడు? మధ్యలో వెళ్ళిపోదామంటే పద్మ విసుక్కొంది. వాళ్ళేమో తన బాధ చూసి నవ్వులు... 'శుభం' అనే అక్షరాలు చూసేవరకు హాల్లోంచి కదలని పద్మను లైట్లు వెలిగాక వాళ్ళు చూపులతో తినేస్తుంటే తనకు తల కొట్టేసినట్టయింది.

చీటికీమాటికీ పుట్టింటికి వెడతానంటుంది. అక్కడ వాళ్ళ చదువుకొన్న బావతో వొళ్ళు మరిచి బాతాఖానీ కొడుతుంది. ఆ బావగాడి జోకులు, గొప్పలు తనకు విసుగు వచ్చేవరకు చెపుతుంది. వాడితో పెళ్ళికి పూర్వం ఏ సంబంధం లేకపోతే వాడి ప్రసక్తి తెచ్చి ఎందుకు మురిసిపోతుంది?

...ఇలాంటి విషయాల గురించి పద్మకు ఎంత సున్నితంగా నచ్చచెప్పినా వినదు. ఎదురు అభాండా లేస్తుంది. గట్టిగా ఏమైనా అంటే కోపగించి నిరాహారదీక్ష చేస్తుంది.

పద్మ మీద ఊహాపోహాలతో దూరం తెలియని రాంబాబు సైకిలు ఓ పెంకుటింటి ముందాగింది.

సైకిల్‌కి స్టాండువేసి గుమ్మంకేసి చూశాడు రాంబాబు. తలుపులు వేసివున్నాయి. అరుగుమీద మనిషిలేదు.

అనుమానంతో గుమ్మమెక్కిన రాంబాబు, చేరవేసి వున్నాయేమోనని తలుపులు తోశాడు... ఊహూ... లోపల గడియపెట్టే వున్నాయి. రగులుతున్న కోపంతో కంఠం శ్రుతి తప్పుతుండగా... 'పద్మా, పద్మా' అంటూ పిల్చాడు... లోపల్నుంచి సమాధానం లేదు!

అసహనంతో చేతిలోని కర్ర మొనతో తలుపు మీద పొడిచి మరీ పిల్చాడు. అయినా తలుపులు తెరుచుకో లేదు. పిలుపుకు బదులు లేదు.

రాంబాబు కళ్ళముందు రాజాతో నగ్నంగా వున్న పద్మ రూపం కదిలింది. రాంబాబు రగులుతున్న అగ్ని పర్వతంలా వున్నాడు... తన భంగపాటును ఎవరైనా గమనిస్తున్నారేమోనని వీధివైపు చూశాడు. ఎవరూ కని పించలేదు.

అరుగుమీద వున్న బెడ్‌రూం కిటికీ దగ్గరకు వెళ్ళి గట్టిగా తడదామనుకొని క్షణం నిదానించి ఆగాడు - కిటికీకి చెవి ఆనించి నిల్చున్నాడు.

లోపల నుండి ఏవో గుసగుసలు... భయపడుతున్న హడావిడి.

అస్పష్టంగా రెండు ఆకారాలు... ఆడామగాలా వున్నారు. బట్టలు సరిచేసుకొంటున్న దృశ్యం... ఆవేశంతో శివమెత్తిపోయిన రాంబాబు బల్లెం కర్రను సవరించుకొని 'పద్మా... పద్మా' అని పిలిచాడు.

'ఎవరు? వస్తున్నా' - అది మగగొంతు. అడుగుల చప్పుడు కూడా మగాడిదే!

తలుపులు తెరుచుకున్నాయి... ఎదురుగా గాబరా పడుతూ చిట్టిబాబు! బావమరిది బెదురును చూసి పట్టరాని ఆవేశంతో లోపలకు అడుగుపెట్టిన రాంబాబుకు దొడ్డిదారిన పరుగెత్తుతున్న ఓ ఆడది కన్పించింది - ఆమె ఎదురింటి పడుచు వితంతువు తులసి!

రాంబాబుకు పరిస్థితి అర్థమైంది. క్షణం నోట మాట రాలేదు. 'కుర్రకుంక కాపలా వుంటాడని తీసికొస్తే వాడికే కాపలా కాయాల్సొచ్చేలా వుంది.'

"నీ అక్కేదిరా బామ్మరదీ?" రాంబాబు నిశిత మైన చూపుకి కుర్రాడు గజగజలాడిపోయాడు.

"గుళ్ళో భగవద్గీత చెప్తుంటే వెళ్ళింది. టీ కాచి ఫ్లాస్కులో పోసింది. మీకు తీసుకెళ్ళి ఇమ్మంది. తీరా బయల్దేరదామనుకునేసరికి..."

"ఆ రంభ వచ్చి వాటేసేసిందా?"

"తప్పయిపోయింది బావగారూ... అక్కకు చెప్ప కండి. చంపేస్తుంది" తలుపులు మూసి రాంబాబు రెండు కాళ్ళు పట్టేశాడు చిట్టిబాబు.

"ఎంతకాలం నుంచి సాగుతోందీ వ్యవహారం."

"ఇదే మొదటిసారి... నేనంటే యిష్టమని ఉత్తరాలు రాసింది. అక్క బయటకు వెళ్ళడం చూసి లోపల కొచ్చింది."

"చేసిన ఘనకార్యం చాలుగాని, మళ్ళీ ఇలా జరిగితే మీ నాన్నగారితో చెప్పి నీ పెళ్ళి చేయిస్తాను."

"మీరు పొమ్మంటే పోతానుగాని నాన్నగారికి మాత్రం చెప్పకండి. మీకు పుణ్యం వుంటుంది. ఆ తులసి కళ్ళు ఎప్పుడూ నా మీదే. రాజా అడ్డులేకుండా వుండడానికి మీకు ఏదో ఆకాశరామన్న వుత్తరం కూడా రాసిందట."

"ఆ వుత్తరం దాని నిర్వాకమా? దాని సంగతి నేను తేలుస్తానుగాని, నువ్వు మాత్రం వెధవ వేషాలు వెయ్యకు" హెచ్చరించి సైకిలెక్కాడు రాంబాబు.

కల తెచ్చిన కలవరంతో పద్మను అనుమానించి నందుకు, ఆమె చేష్టల్ని అపార్థం చేసుకున్నందుకు సిగ్గు పడ్డాడు రాంబాబు. నల్లని మేఘంలా వెళ్ళి పాడిమబ్బులా తిరిగొచ్చిన రాంబాబు వాలకం చూసి ఆశ్చర్యపోయాడు నారాయుడు.

ఆడగాలి తగిలిందేమో- ఆనందంగా వున్నాడు కాపు అనుకున్నాడు అన్నం తింటున్న నారాయుడు.

"ఏరా ఇంత ఆలస్యమైందే?"

"మా ఆడోళ్ళు పుట్టింటికెళ్ళిందటండి. మా ముసల్ది కళ్ళానక తడుముకుంటూ వచ్చేసరికి ఈ టయి మయిందంట."

"ఒరే, నీ ఆవిడ అస్తమానూ పుట్టింటి కెళ్తుంది. నీకేం అనుమానం రాదూ? అసలే అది షోకులాడి."

"బాబుగారూ, ఆ పిల్ల అలాంటిది కాదండి. ఒకేల అలాంటిదే అయితే కాపలా కాసి యెందాకా సత్తాం చెప్పండి. ఆడదానికి మనసులో వంకరే వుండకూడదు కాని - వుంటే ఆపడం మనోళ్ళ అవుతుందా? రంకూ బొంకూ బయటపడక ఎన్నాళ్ళుంటాయండీ? పై రుచి మరిగిన ఆడదాన్ని నొగ్గెయ్యడం మగతనం కాని - కాపలా కుక్కలా యెంటబడ్డోడు మగోడటండి."

'ఓరి వెధవా, నీ సంస్కారం ఎంత గొప్పదిరా!' అని నారాయుణ్ణి మనసులో అభినందించిన రాంబాబు-

"నువ్వేమంటావో అని అడిగాను, నువ్వు చెప్పింది నిజం" అన్నాడు.

రాంబాబు మనసు, పక్కనే వున్న మసి తుడిచి శుభ్రం చేసిన హరికేన్ లైటు చిమ్నీ ఒకేలా వున్నాయి.

